క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి



భిక్కనూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు వెంటనే పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ సుభాష్ అన్నారు. గురువారం ర్యాగట్ల పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అర్హుడికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య తదితరులున్నారు.

బంజపల్లి గ్రామ పంచాయతీలో..



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం స్థానిక ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. బేస్‌మెంట్ పూర్తయిన లబ్ధిదారులకు బిల్లులు ఖాతాల్లో వేయిస్తామని చెప్పారు. జీపీ కార్యదర్శి భీంరావ్ తదితరులున్నారు.

పంటల పరిశీలన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాలలో పంటలను గురువారం ఏవో నర్సింలు పరిశీలించారు. పంటల రక్షణలో రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కజొన్న పంటలో అక్కడక్కడ కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉందని, దానికి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రారంభ దశలో ఉన్నట్లయితే ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును పిచికారీ చేయాలని, ఉధృతంగా ఉన్నట్లయితే బ్యారజైడ్ అనే కెమికల్, నోవేల్యూరాన్ మందును పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బాన్సువాడ రూరల్: సోమేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం పీఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత పోచారం సురేందర్‌రెడ్డి తరఫున కొల్లూర్ మహేందర్‌రెడ్డి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్కులను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తామన్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రసన్నజ్యోతి, నాయకులు వీరేశం, మొగులయ్య, బీమ గంగారాం, జీపీ కార్యదర్శి నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అభినందన



బీబీపేట: మండల కేంద్రంలోని టీఎస్‌ఎస్‌ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇటీవల పదవ తరగతి పూర్తి చేసిన ఐదుగురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందడంతో వారిని గురువారం పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు. అంతే కాకుండా పాఠశాల హెచ్‌ఎం రవీంద్రారెడ్డి విద్యార్థులకు కళాశాల బ్యాగుతో పాటు లగేజీ బ్యాగులను అందజేశారు.

కంప్యూటర్ పరికరాల వితరణ



బీబీపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గురువారం ఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుభాష్‌రెడ్డి తరఫున కంప్యూటర్, స్కానర్, ప్రింటర్‌ను డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులు, కళాశాల సాధన సమితి సభ్యులు మాట్లాడుతూ.. అడిగిన వెంటనే సహకారం అందించిన సుభాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకులు రవీందర్ రెడ్డి, మట్ట శ్రీనివాస్, అశోక్ గౌడ్, డా. సంతోష్ గౌడ్, దేవరాజు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెనలు లేక తిప్పలు

- వర్షాలు కురిస్తే రాకపోకలు బంద్
- ఏళ్లు గడుస్తున్నా పరిష్కారానికి నోచుకోని వంతెనలు
- వంతెనలు నిర్మించాలంటున్న తండాల వాసులు



యాచారం గ్రామానికి వెళ్లే దారిలోని కల్వర్టు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని వజ్జపల్లి తండా, యాచారం, లక్ష్మీనాయక్ తండా, పూర్యానాయక్ తండా, సజ్జ నాయక్ తండాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న రెండు కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. వర్షాలు కురిస్తే చాలు పైన ఉన్న పంట పొలాల నుంచి భారీగా నీరు వచ్చి ఇరు వైపులా రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఈ దారి గుండా నిజామాబాద్ జిల్లాకు కూడా రాకపోకలు సాగుతుంటాయి. దీంతో ద్విచక్ర వాహనాలే కాకుండా కార్లు, ఇతర వాహనాల రాకపోకలు కొనసాగుతుండడం వల్ల ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతాయి. అంతే కాకుండా సమీపంలో ఉన్న పంట పొలాలకు వెళ్లాలంటే కూడా ఈ కల్వర్టులు దాటి వెళ్లాల్సి వస్తోంది. భారీగా నీరు పారుతున్నప్పుడు పంట పొలాలకు వెళ్లడం కుదరదని తండా వాసులు పేర్కొంటున్నారు. ఎన్నికలప్పుడు తండాలకు ఓట్లు అడగడానికి వచ్చే ప్రజాప్రతినిధులకు ఈ వంతెనల విషయం దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు. అధికారులు దృష్టి సారించి వెంటనే వంతెనల నిర్మాణం కోసం నిధులు కేటాయించి నిర్మాణాలు చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు.

ఏండ్ల సంది గిట్లనే ఉంటది



నాకు బుద్ధి తెల్సినప్పటి జూత్తున్న గివి గిట్లనే ఉన్నవి. ఇంక మస్తు పొక్కలు పడ్డయ్. వర్షం పడ్తే దాటుడు కష్టమే ఐతది. ఎక్కడోడు అక్కడే ఉండుడే ఐతది. ఊళ్లకి అచ్చిన సార్లకు జెప్పినగింతే అప్పటి మట్టుకు జెత్తం అంటరు గాని గెలిచినంక గిటుమోకాన జూడరు. బ్రిడ్జి అయితే అందరికి మంచిగుంటది.

– ఈరు, లక్ష్మీనాయక్ తండా

నేటి చిత్రం



రోడ్డుపైన గుంతలను పూడ్చాలి

రామారెడ్డి: రామారెడ్డి శివారులో రెడ్డిపేట వెళ్లే మార్గంలో పెద్ద గుంతలు పడి వర్షం పడితే నీళ్లు నిలుస్తున్నాయి. ఈ రోడ్డు వెంట నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. గుంతల్లో పడి ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి పాత బీటీ రోడ్డుపై కొత్త రోడ్డును వేయించాలి. – శంకర్, రెడ్డిపేట్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200 | ఎల్లారెడ్డి : 97053 46576 | బాన్సువాడ : 94402 11363 | జుక్కల్ : 97053 46578

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై భార్గవ్ గౌడ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : పాఠశాల విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్ గౌడ్ సూచించారు. తాండూర్ హైస్కూల్‌లో గురువారం వివిధ రకాల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పాఠశాలలోని బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. దీంతోపాటు విద్యార్థులు సైబర్ నేరాల గురించి తెలుసుకొని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లను విజ్ఞానాన్ని పెంచుకునేందుకు మాత్రమే ఉపయోగించుకోవాలని, గుర్తు తెలియని లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, పోలీస్ కళాబృందం సభ్యులు తిరుపతిరెడ్డి, అనిల్, భరోసాకేంద్రం సిబ్బంది సవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



బాన్సువాడ : పట్టణంలోని సంగమేశ్వర కాలనీలోని మొదటి రోడ్డులో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. వంగి రోడ్డు మీద పడేలా ఉంది. ఆ మార్గంలో అభయ అంజనేయ ఆలయానికి వచ్చే భక్తులు భయందోళనకు గురవుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి సరి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

యాజమాన్య ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయండి



డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

బాన్సువాడ : ప్రభుత్వం ప్రారంభించే యాజమాన్య ప్రాథమిక పాఠశాలలను వెంటనే ఏర్పాటు చేయాలని గురువారం డీఈవో రాజుకు ప్రభుత్వ టీచర్స్ అసోసియేషన్(జీటీఏ) సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీటీఏ జిల్లా అధ్యక్షులు బాల్‌రాజ్ మాట్లాడుతూ..ముఖ్య పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు. 2025 వేసవికాలంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన ఐదు రోజుల సంపాదిత సెలవులను వెంటనే మంజూరు చేయాలన్నారు. జీటీఏ ఉపాధ్యాయులు యాదయ్య, అనంతరాజు, మధుసూదన్‌రెడ్డి, సలీం తదితరులున్నారు.

విద్యుత్ ప్రమాదాలతో జాగ్రత్త!



రాజంపేట: రైతులు పంట పొలాల వద్ద విద్యుత్ ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని డీఈ కళ్యాణ చక్రవర్తి సూచించారు. శివాయిపల్లిలోని రైతుల పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. విద్యుత్ పొదుపు, ప్రమాదాలు భద్రత విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈ నాందేవ్, లైన్ ఇన్‌స్పెక్టర్ మసూద్ అలీ, లైన్‌మెన్ బ్రహ్మం, సుధాకర్, ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న పాఠశాల పరిశీలన



మాచారెడ్డి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గదులను డీఈవో రాజు గురువారం సందర్శించారు. 'సాక్షి' దినపత్రికలో గురువారం ప్రచురితమైన 'పొంచి ఉన్న ప్రమాదం- ఎందుకింత నిర్లక్ష్యం' శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించి పాఠశాలను పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి అంచనాలను రూపొందించాలని నిర్ణయించారు. ఎంఈవో దేవేందర్ రావు, ఎంపీడీవో గోపిగౌడ్, హెచ్‌ఎం అశోక్‌కుమార్, తదితరులున్నారు.

ఆలయ భూమి సర్వే



నస్రుల్లాబాద్: బొమ్మన్‌దేవ్‌పల్లిలో హనుమాన్ ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. గురువారం రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ పూల్ సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఊరుకునేది లేదన్నారు. సర్వేయర్ మధు మాజీ సర్పంచ్ అన్నం సత్యానారాయణ పీఏసీఎస్ చైర్మన్ గంగారాం, తదితరులున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

షబ్బీర్ అలీకి ఆహ్వానం



భిక్కనూరు: మండలంలోని భాగిర్తిపల్లిలో ఈ నెల 13న నిర్వహించనున్న ముత్యాలమ్మ పండుగకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని గ్రామస్తులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. నేతలు పల్లెర్ల సంతోష్ కుమార్, నర్సింలు, రాజం అశోక్, మధు యశ్వంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలు మానుకోండి

మద్నూర్(జుక్కల్) : జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుపై తప్పుడు విమర్శలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరాస్ సాయిలు అన్నారు. మద్నూర్‌లో గురువారం ఆయన మాట్లాడారు. అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక ప్రతిపక్షం వాళ్ల కళ్లు మండుతున్నాయని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో నియోజకవర్గానికి అన్ని విధాలుగా అన్యాయం జరిగిందని ఆరోపించారు.

తీరిన నీటి సమస్య

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని 7వ వార్డులో గల అంగన్వాడీ కేంద్రానికి నీటి సమస్య తీరినట్లు అంగన్‌వాడీ సిబ్బంది తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి నీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక నాయకులకు, మున్సిపల్ సిబ్బందికి సూచించడంతో వారు స్పందించి నీటి కనెక్షన్ అందించారని తెలిపారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వినోద్ గౌడ్, మహేష్, ప్రశాంత్ తదితరులున్నారు.

సంక్షిప్తం

సమగ్ర వ్యాధి నిర్ధారణ శిబిరం

దోమకొండ: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దోమకొండలో గురువారం సమగ్ర వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐసీటీసీ జిల్లా కౌన్సిలర్ నాగరాజు, ఎస్‌టీఎస్ శ్యామ్ కుమార్, సూపర్ వైజర్ ప్రేమలత, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, వైఆర్‌జీకేర్ డీఆర్‌పీ సుధాకర్, ఎంఐసీటీసీ కౌన్సిలర్ అనిల్‌పాల్గొన్నారు.

'సమస్యలపై రైతులందరూ ఉద్యమించాలి'

కామారెడ్డి అర్బన్: యూరియా కొరత, సన్న వడ్లకు రూ.500 బోనస్, విద్యుత్, పాల ఉత్పత్తిదారుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఉదాసీనంగా ఉండడంపై రైతులందరు ఉద్యమించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం బీకేఎస్ జిల్లా సమావేశం నిర్వహించగా వివిధ మండలాల ప్రతినిధులు సమావేశానికి హాజరైన ఏవో శ్రావణ్‌కుమార్‌కు సమస్యలను వివరించారు. నేతలు ఎస్.సాయిరెడ్డి, శంకర్‌రావు, బైరెడ్డి, సాహెబ్‌రావు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలి

కామారెడ్డి టౌన్: కేంద్ర, ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్బాస్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల శిక్షణ తరగతుల కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. నేతలు వెంకట్‌గౌడ్, మోతిరాం, కొత్త నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థుల్లో సృజనాత్మకతను, డిజిటలైజేషన్‌పైన ప్రత్యేక దృష్టి పెట్టి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం వసుధ సూచించారు. గురువారం ఆమె మండలంలోని పర్మళ్ల, పర్మళ్ల తండా ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎల్‌ఎన్ బేస్‌లైన్ టెస్టు రిపోర్టును పరిశీలించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. సీఆర్పీ రాజు, హెచ్‌ఎంలు రాజేందర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంక్షేమం పథకాలపై కళాజాత

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు కళాజాత కార్యక్రమం నిర్వహించారు. గురువారం లింగంపేట మండలం శెట్పల్లి జీపీ ఆవరణలో కళాజాత చేపట్టారు. ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. కళాజాత సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కల్వరాల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం మల్లుపేట్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తన సొంత డబ్బులు రూ.12 వేలతో బూట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, సౌజన్య, నందురావు, పాల్గొన్నారు.

రేపు ఉత్తునూర్‌లో బంగారు మైసమ్మ పండుగ

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : ఉత్తునూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించే బంగారు మైసమ్మ బోనాల పండుగకు గ్రామ దేవతల ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. బంగారు మైసమ్మతో పాటు నల్ల పోచమ్మ, ఐదు చేతుల పోచమ్మ, నాయకమ్మ, ముత్యాలమ్మ విగ్రహాలను శుద్ధి చేస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఒక్కో బోనం తీసి గ్రామ దేవతలకు సమర్పించనున్నట్లు వీడీసీ చైర్మన్ శ్రీకాంత్ పేర్కొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో తహసీల్దార్ రాజ నరేందర్ గౌడ్ బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఫాం 6ఏ, 7, 8 లకు సంబంధించి బీఎల్‌వోలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఓటరు నమోదు ప్రక్రియ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

రాష్ట్రం విడిపోయినా.. పేరు మారలేదు



తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు గడిచినా పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు ఇంకా ఉమ్మడి రాష్ట్రంలోనే ఉన్నామన్న ధ్యాసలో ఉన్నారనడానికి పాల్వంచ మర్రి బస్‌షెల్టర్ సాక్ష్యంగా నిలుస్తోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని శాఖల అధికారులు బోర్డులను మార్చి తెలంగాణ రాష్ట్రం పేరు రాయించారు. కానీ పాల్వంచ మర్రి వద్ద ఉన్న బస్‌షెల్టర్‌కు పేరు మార్చడం మాత్రం పంచాయతీరాజ్‌శాఖ అధికారులు మర్చిపోయారు. – మాచారెడ్డి

సరిపడా ఎరువులను సరఫరా చేయాలి



తాడ్వాయిలో మాట్లాడుతున్న డీఎస్పీ నాయకులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : కేంద్ర ప్రభుత్వం రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేయాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తాడ్వాయి మండల కేంద్రంలో వారు మాట్లాడారు. తెలంగాణ రైతాంగానికి ఏప్రిల్, మే, జూన్ నెలలకు గాను 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేంద్ర ప్రభుత్వం కేటాయించాల్సి ఉండగా 3 లక్షల 75 వేల మెట్రిక్‌టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారన్నారు. ఇప్పటికే అప్పులు చేసి పంటలు వేసిన రైతాంగం సరైన సమయంలో ఎరువులు వేయకపోతే పంటనష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి రైతులకు సరిపడా యూరియా ఎరువులు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. నేతలు రాజశేఖర్, బాబు, మోహన్, నితిన్, రవి తదతరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ మాయం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్ గ్రామంలో మురికి కాలువల్లో మురికి పేరుకుపోయి దోమల బెడద ఎక్కువ అవుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మురికి కాలువలపై పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో మురికి ముందుకు కదలడం లేదని, అధికారులు దృష్టి సారించి మురికి కాలువలను శుభ్రపరచాలని కోరుతున్నారు.

భూమికి పచ్చని హారంలా..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): వర్షాలు కురియడంతో మండలంలోని యాచారం శివారులో ఎక్కడ చూసినా నానా పచ్చని పంట పొలాలతో ప్రాంతమంతా దర్శనమిస్తుంది. గుట్టలపై సైతం పంటలు సాగు చేయడంతో పచ్చనిహారంలా కనువిందు చేస్తుంది. అక్కడి వాతావరణమంతా ఆహ్లాదాన్ని నింపుతోంది.

రైతులు నానో ఎరువులనే వాడాలి



గాంధారిలో పంటను పరిశీలిస్తున్న ఏవో రాజలింగం

గాంధారి(ఎల్లారెడ్డి) : రైతులు సాగు చేసే పంటలకు నానో రసాయన ఎరువులనే పిచికారీ చేయాలని ఏవో రాజలింగం సూచించారు. గురువారం ఆయన మండల పరిధిలోని పలు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి మొక్కజొన్న, సోయా పంటలను పరిశీలించారు. రసాయన మందులను పిచికారీ చేసే డ్రోన్‌ను ప్రారంభించారు. నానో ఎరువులను పిచికారీ చేయడం వల్ల పంటల ఆకులపై పడి పోషకాలు వృథా కాకుండా మొక్కలకు అందుతాయని అన్నారు.

యూరియా స్టాక్ తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని వెల్లుట్ల, గండిమాసానిపేట, మత్తమాల సొసైటీల పరిధిలో గల గోదాములలో యూరియా స్టాకును ఏడీఏ సుధామాధురి పరిశీలించారు. మండలంలో యూరియా కొరత లేదని ఆమె తెలిపారు. ఏవో నదీమోద్దీన్ తదితరులున్నారు.

ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములు

- సర్వే నిర్వహించి భూములను కాపాడాలని గ్రామస్తుల వినతి



వినతి పత్రం అందజేస్తున్న గుండారం గ్రామస్తులు

రాజంపేట : గుండారం పరిధిలోని గుండ్ల చెరువు ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామ చావిడి వద్ద గురువారం గ్రామస్తులు సమావేశమై గుండ్ల చెరువు కబ్జా విషయంపై చర్చించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేస్తున్నాడని కబ్జాకు గురైన భూములను కాపాడుకునే బాధ్యత గ్రామస్తులందరిపై ఉందన్నారు. భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదని వాపోయారు. ఈ విషయంపై తహసీల్దార్‌తో పాటు ఇరిగేషన్ అధికారులకు, కలెక్టరేట్‌లో వినతి పత్రాలు అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 22 లక్షలకు పైగా పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుతున్నారని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్యులు నీల నాగరాజు, నాయకులు లక్ష్మణ్, బోలేశ్వర్, రాజు, గంగరాజు, రాజశేఖర్, మోహన్ ఉన్నారు.